క్లుప్తంగా

విద్యార్థులకు వైద్యపరీక్షలు



కలిగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల వసతి గదులు, వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ప్రతి గురువారం ఐరన్ మాత్రలను మింగాలని సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపల్ ఇందిర, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



ఆత్మకూరురూరల్: చెర్లోయడవల్లిలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల మదమాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో 138 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆలంబర ఫౌండేషన్, ఇండియా సహకారంతో బీపీ,షుగర్ రోగులకు మూడు నెలలకు సరిపడా మందులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యారోగ్య శాఖకు చెందిన షంషాద్‌బేగం, మాధురి, మమత, ఆశావర్కర్ కాంతమ్మ, బీఎస్సార్ ఆస్పత్రి కాంపౌండర్ పెంచలయ్య, తదితరులు సహకారం అందించారు.

పరామర్శ



సీతారామపురం: వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ పాతెం రమణయ్యను ఆ పార్టీ సీనియర్ నాయకుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కల్లూరి జనార్దన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాముల రమణయ్య, దయాకర్‌రెడ్డి, గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి, దేవిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్‌నాయుడు, తదితరులు ఉన్నారు.

ఆశీర్వచనం



సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లిలో శనివారం జరిగిన ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి కుమార్తె శ్వేతారెడ్డి వివాహ వేడుకకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా వివాహ వేడుకకు హాజరై ఆశీర్వచనం అందించారు.

నేడు గొల్లపల్లెలో అంబళపూజ

వరికుంటపాడు: మండలంలోని గొల్లపల్లెలోని నాగార్పమ్మ ఆలయ ఆవరణంలో అయ్యప్ప స్వామి అంబళ పూజా కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం గణపతి హోమం నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం అయ్యప్పల ఇరుముడులు ధరించి శబరిమలకు బయలుదేరనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా ప్రీక్రిస్మస్ వేడుకలు

అల్లూరు: స్థానిక క్రిస్టియన్‌పేటలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ పాల్ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. పాస్టర్లు వినీత్‌కుమార్, పీటర్, సురేష్‌బాబు, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలకు చెందిన గొల్లపల్లి చిన గురువయ్య అనే వ్యక్తి మూడ్రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వింజమూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ లేఅవుట్‌కు రోడ్డు

- ఆటోనగర్‌కు కేటాయించిన భూమిలో రోడ్డు ఏర్పాటు
- దాన్నే చూపుతూ నుడా నుంచి అనుమతులు
- దారి సమస్యను గోప్యంగా ఉంచి ప్లాట్ల విక్రయం
- లోకాయుక్తకు సంగం మండలవాసి ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన లోకాయుక్త



లేఅవుట్‌కు ప్రభుత్వ స్థలంలో నుంచి ఏర్పాటు చేసిన దారి



లేఅవుట్‌కు దారి చూపిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆత్మకూరు: మేజర్ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు పుష్కరకాలం క్రితం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఇటీవల కాలంలో పట్టణానికి పల్లెల నుంచి వలసలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో పట్టణానికి చుట్టుపక్కల నూతన లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొందరు అనుమతుల్లేకుండానే, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించకుండానే లేఅవుట్లను వేస్తున్నారు. లేఅవుట్లకు పూర్తిస్థాయి అనుమతులు ఉన్నాయా..లేవా.. అనే విషయాన్ని విచారించకుండానే పలువురు ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయిన ఘటనలు ఉన్నాయి. ఇటీవల మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ ఎదురుగా నెల్లూరు–ముంబై జాతీయ రహదారి సమీపంలో ప్రకృతి అవెన్యూ పేరుతో నూతన లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి రోడ్డును రియాల్టర్ ఏకంగా ప్రభుత్వ భూమిలోని చూపించి నుడా ఆమోదం సైతం పొందారు.

ఆటోనగర్‌కు కేటాయించిన భూమిని ఆక్రమించి

మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్లు 4, 5, 6, 7లో సుమారు 11 ఎకరాల్లో ప్రకృతి అవెన్యూ పేరుతో నూతనంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్ నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు రోడ్డు లేదు. లేఅవుట్ పక్కనే సర్వే నంబరు 90లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఏడేళ్ల ఏళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటోనగర్ కోసం కేటాయించారు. అప్పట్లో ఆటోనగర్‌కు శంకుస్థాపన సైతం చేశారు. ఆ తరువాత దానిని పట్టించుకోలేదు. ప్రస్తుతం లేఅవుట్ నిర్వాహకులు సర్వే నంబరు 90లోని 1.50 ఎకరాలను ఆక్రమించి 40 అడుగుల వెడల్పు, 280 మీటర్ల మేర పొడవుతో జాతీయ రహదారి వరకు రోడ్డును ఏర్పాటు చేశారు. దాన్నే లేఅవుట్‌ప్లాన్‌లో చూపి నుడా అనుమతులు సైతం పొందారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి ప్లాట్లను సైతం విక్రయిస్తున్నారు. లేఅవుట్‌కు కేటాయించిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే రెవెన్యూ అధికారులు కన్వర్షన్ చేయడం, నుడా అధికారులు అనుమతులు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో నుడా నుంచి అనుమతులు తెచ్చుకుని ఉంటారేమోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంగం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తకు నాలుగు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. స్పందించిన లోకాయుక్త పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను అందజేయాలని శుక్రవారం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్లు

ఉదయగిరి: మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ మిట్టపల్లిలో గల అడవి పేరంటాలమ్మ ఆలయ సమీపంలో మహిళ మెడలో సరుడును శుక్రవారం అపహరించి పరారైన ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. ఉదయగిరి నుంచి హైదరాబాద్‌కు బస్సులో వీరు బయల్దేరారు. అప్పటికే అందిన సమాచారంతో గండిపాళెంలో స్థానికులు పట్టుకునేందుకు యత్నించగా, ఒకరు పట్టుబడగా, ఇద్దరు తప్పించుకున్నారు. వీరి కోసం ఎస్సై ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. వరికుంటపాడు మండలం గొల్లపల్లి వద్ద వీరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు.

ఎన్నికల సిబ్బంది ఆవేదన

ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల విధులకు 900 మందికిపైగా హాజరయ్యారు. ఉదయం 7 గంటలకే విధులకు హాజరవ్వాలని అధికారులు చెప్పడంతో సుదూర ప్రాంతాలకు చెందిన వారు శుక్రవారం రాత్రే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని సమీపంలోని లాడ్జిల్లో బసచేశారు. ఎన్నికలు ముగిశాక టీఏ, డీఏ ఇవ్వకుండా పంపడంతో వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయగిరి ఇరిగేషన్ డీఈ చంద్రమౌళిని వివరణ కోరగా, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి నగదు రానందున ఎన్నికల సిబ్బందికి ఇవ్వలేదని తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 2,738 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ



ఆత్మకూరు కోర్టులో..

కావలి: కావలి సబ్‌కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ అధ్యక్షత వహించి మాట్లాడారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం, నగదు వృథా చేసుకోకుండా లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే కాత్యాయని కలిసి 2738 కేసులను పరిష్కరించారు. అందులో 22 సివిల్, 698 క్రిమినల్, 2వేలు ఎస్టీసీ, చెక్‌బౌన్స్ కేసులు ఉన్నాయి. సుమారు రూ. 22లక్షల నగదును కక్షిదారులకు అందించారు. బ్యాంకు కేసులకు సంబంధించి పీఎల్‌సీ ద్వారా సుమారు రూ.26లక్షలను రికవరీ చేసినట్లు లోక్ అదాలత్ చైర్మన్ ఎం శోభ తెలిపారు. అడిషనల్ పీపీ కే రామకృష్ణ , ఏపీపీ మృదుల, కావలి బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కే సురేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు సీహెచ్ సునీల్, న్యాయవాదులు కే.శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి జీ మాల్యాద్రి, కెనడీ, కలీం రోజ్దార్, వై.వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, ఐ సాయిప్రసాద్, పీవీ రమణారెడ్డి, కిరణ్, బెంచ్ మెంబర్లు జే శ్రీదేవి, కే రాము, లోక్‌అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ 1126 కేసుల పరిష్కారం

ఆత్మకూరు: పట్టణంలోని రెండు కోర్టుల పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1126 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి గాయత్రిదేవి తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్‌కుమార్‌తో కలిసి బీఎస్‌ఎన్‌ఎల్, ఎక్సైజ్, బ్యాంకు, తదితరాలకు సంబంధించిన కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించి రూ.49,34,682 నగదును కక్షిదారులకు అందించినట్లు వివరించారు. లోక్ అదాలత్ కమిటీ సభ్యులు ఎస్ ఓబులేసు, ఎల్‌వీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో వెలగని డిస్‌ప్లే బోర్డులు



కావలి: కావలి రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు రైల్వే అధికారులు పరీక్షలు పెడుతున్నారు. ప్లాట్‌ఫామ్‌పై రైలే ఆగే సమయంలో ఏ బోగీ ఎక్కడ ఉంటుందనే సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేయాలనే లక్ష్యంతో రైల్వే శాఖ ప్లాట్‌ఫామ్‌లపై డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేసింది. దీనివల్ల కేవలం నిమిషాలు మాత్రమే ఆగే రైలులో తాము ఎక్కాల్సిన బోగి ప్లాట్‌ఫామ్‌పై ఏ ప్రదేశంలో ఆగుతుందో ముందుగానే తెలుసుకుని ప్రయాణికులు ఆ ప్రదేశంలో వేచిచూస్తుంటారు. కానీ కావలి రైల్వే స్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డులు పని చేయకపోవడంతో రైలు ఆగిన తర్వాత తాము ఎక్కాల్సిన బోగి కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వసతిగృహ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అస్మా

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్సీ బాలికల, బీసీ బాలుర వసతిగృహాలతో పాటు ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలను అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి అస్మా శనివారం సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థుల వసతిగదులు, వంట గదులను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూశారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. పోషకాహారం తీసుకో వాలని సూచించారు.హాస్టల్ పరిసరాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీహెచ్‌ఈఓ ఎస్ సుధాకర్, ఏఎన్‌ఎం సుభాని, హాస్టల్ వార్డెన్లు స్పందన, బీ పద్మనాభ రెడ్డి, సిబ్బంది, ఆశాలు విజయలక్ష్మి, అనిత, ధనలక్ష్మి ఉన్నారు.

జర్నలిస్టులపై దాడి అప్రజాస్వామికం

కావలి: జర్నలిస్టులపై దాడి అప్రజాస్వామికమని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సీ శారద, సభ్యులు షేక్ ఫాతిమా, టీ సుజాత, షేక్ నూర్జహాన్, కామాక్షి, లావణ్య శనివారం ఓ సంయుక్త ప్రకటనలో ఖండించారు. జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభంగా ఉండి సమాజంలోని చీకటి కోణాలను వెలికితీస్తూ ప్రజల పక్షాన నిలబడే జర్నలిస్టులపై దాడులను ప్రజాతంత్రవాదులంతా తీవ్రంగా ఖండించాలన్నారు. వైఎస్సార్ జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన కవరేజ్ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులపై విచక్షణా రహితంగా రాళ్లు విసరడం, కర్రలతో దాడి చేయగా ముగ్గురు గాయాలపాలవడం బాధాకరమన్నారు. రాజకీయ కక్షలకు మీడియాను బలిచేయడం దారుణమని, జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రంగవల్లుల పోటీలు



ఉదయగిరి: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఉదయగిరిలోని హోలీ ఏంజెల్స్ హైస్కూల్‌లోని విద్యార్థినులకు శనివారం గణితంపై రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు కరస్పాండెంట్ సుధాకర్ బహుమతులు అందజేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



కావలి: పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలక విరిగిపోయింది. 33, 34, 37, 39 తదితర వార్డులకు చెందిన ప్రజలు ఈ వీధిలో నుంచే పట్టణంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వీధిలో నిత్యం పాఠశాలల వ్యాన్లు, లారీలు, ఆటోలు, కార్లు రాకపోలు సాగిస్తుంటాయి. ట్రంకురోడ్డు నుంచి వీధిలోకి వచ్చే ముందు డ్రైనేజీపై ఉన్న సిమెంట్ పలక దెబ్బతినడంతో వాహనదారులు మలుపు తిరిగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పలకపై పాదచారులు ఏమాత్రం కాలు మోపినా, వాహనాలు ఎక్కినా ప్రమాదం జరుగుతుంది. మున్సిపాలిటీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- ఎన్నికలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ
- ఏకపక్షంగా సాగిన ఎన్నికలు
- ఏ కిస్తీపురంలో నోడ్యూ సర్టిఫికెట్ల పేరుతో రైతుల అడ్డగింత
- గానుగపెంటలో బొల్లినేని,కాకర్ల వర్గీయుల మధ్య వార్




పెద్దబ్బీపురం పోలింగ్ కేంద్రం వద్ద మోహరించిన పోలీసులు



ఏకిస్తీపురంలో నిరసన తెలుపుతున్న రైతులు

ఉదయగిరి/ఆత్మకూరు: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వైఎస్సార్‌సీపీ బహిష్కరించడంతో ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. ఒకటి రెండుచోట్ల రైతులు పోటీ పడినా నోడ్యూ సర్టిఫికెట్ల పేరుతో పోటీలో నిలబడిన అభ్యర్థులను అధికారులు ఎన్నికల నుంచి తప్పించారు. దీంతో కూటమి ప్రభుత్వానికి చెందిన వారే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వింజమూరు మండలం ఏ కీస్తీపురంలో ఎన్నికలు ఉద్రిక్తతకు దారితీశాయి. టీసీలకు నామినేషన్లు వేసేందుకు కొందరు రైతులు పోలింగ్ కేంద్రాలకు రాగా వీఆర్వోలు ఇచ్చిన నోడ్యూ పత్రాలు చెల్లవని, తహసీల్దార్ కౌంటర్ సంతకం ఉండాలంటూ అధికారులు తిరస్కరించారు. నీటి తీరువా వసూలు చేసి రసీదులు ఇచ్చేది వీఆర్వో లేనని, తహసీల్దార్ ప్రమేయం ఉండదని అధికారులకు చెప్పిన వినలేదు. దీంతో ఎన్నికల అధికారి బాలాజీ శ్రీనివాస్, రైతుల నడుమ వాగ్వాదం నెలకొంది. దీంతో ఎస్సై వీరప్రతాప్ జోక్యం చేసుకుని రైతులను బయటకు పంపే ప్రయత్నం చేయగా వారు ప్రతిఘటించారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు బలవంతంగా రైతులను పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపి గేట్లు మూసివేశారు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏకపక్ష ఎన్నికలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

గానుగపెంటలో బొల్లినేని, కాకర్ల వర్గీయుల మధ్య వార్



గానుగపెంటలో పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించిన బొల్లినేని వర్గీయులు

కొండాపురం మండలం గానుగపెంటలో టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, ప్రస్తుత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వర్గీయులు మధ్యన వార్ నెలకొంది. గ్రామంలో స్వల్ప ఓట్ల బలం ఉన్న కాకర్ల వర్గీయులకు అధికారులు, పోలీసులు మద్దతుగా నిలిచారు. దీంతో బొల్లినేని వర్గం తీవ్రంగా ప్రతిఘటించింది. ఎమ్మెల్యే, అధికారుల తీరుకు నిరసనగా పోలింగ్ బూత్ ముందు బైఠాయించి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామంలో 160 ఓట్లు ఉంటే తమకు 150 ఓట్ల బలం ఉన్నా, నామినేషన్లు వేసేందుకు నోడ్యూ సర్టిఫికెట్లలో తహసీల్దార్ సంతకాన్ని సాకుగా చూపారని వారు వాపోయారు. ఎమ్మెల్యే తీరుపై చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల అధికారులపైన కోర్టుకు వెళతామన్నారు. వింజమూరు మండలం బుక్కాపురంలోనూ నోడ్యూ సర్టిఫికెట్లను అడ్డం పెట్టి టీడీపీ వ్యతిరేక వర్గం రైతులను పోటీలో లేకుండా చేశారు. కాగా ఉదయగిరి ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, గండిపాళెం ప్రాజెక్టు పరిధిలో 34 కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వింజమూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, కొండాపురం మండలాల్లోని 61 కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కావలి–2 సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న జలదంకి, కలిగిరి మండలాల్లో 41 కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా గండిపాళెం ప్రాజెక్టు చైర్మన్‌గా పులివర్తి ప్రసాద్, నక్కలగండి ప్రాజెక్టు చైర్మన్‌గా వేమూరి మధుసూదన్ ఎన్నికయ్యారు.

స్వపక్షంలోనే విపక్షం

ఆత్మకూరు నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రహసనంలా సాగాయి. వైఎస్సార్‌సీపీ ఎన్నికలను బహిష్కరించడంతో టీడీపీ నాయకులు స్వపక్షంలోనే విపక్షంగా ఏర్పడి పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఒకరినొకరు దూషించుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. ఆత్మకూరు మేజర్ చెరువు సాగునీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. టీడీపీ, బీజేపీ, జనసేన ఒక్కో డైరెక్టర్ పదవిని పంచుకున్నాయి. ఏఎస్‌పేట మండలంలోని అబ్బీపురం , జమ్మవరం గ్రామాల్లో వివాదాస్పద పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఓ వర్గానికి మద్దతిస్తూ మంత్రి ఆనం ఇచ్చిన జాబితాలోని వ్యక్తులకు భూమి శిస్తు, నీటి తీరువా కట్టించుకుని రసీదులను అధికారులు అందజేశారు. అదే క్రమంలో మరో వర్గం వారి నుంచి నీటి తీరువా కట్టించుకోకుండానే అధికారులు వెళ్లిపోవడంతో ఆ వర్గం వారు హైస్కూల్ గేట్లు బంద్ చేసి బైఠాయించి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అలాగే జమ్మవరంలోనూ జరగడంతో ఓ వర్గం వారు నిరసన వ్యక్తం చేశారు. చేజర్ల మండలం నాగలవెలటూరులోనూ కొద్దిసేపు టీడీపీలోని ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఆత్మకూరు మండలం బట్టేపాడులో సాగునీటి సంఘం ఎన్నికను ఏకంగా వాయిదా వేశారు. ఇలా స్వపక్షంలోనే విపక్షాలు టీడీపీని నవ్వులపాలు చేశాయి. కాగా ఇరిగేషన్ శాఖ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో సాగిన ఎన్నికలను ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని పర్యవేక్షించారు.

ఆత్మకూరురూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తిగా రైతులకు సంబంధించినవి అయినప్పటికీ కూటమి ప్రభుత్వం రాజకీయం చేసింది. ఎన్నికలు పారదర్శకంగా జరిగే పరిస్థితి లేకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. దీంతో కూటమి నేతలే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరటంపాడు , బట్టేపాడు, మహిమలూరు సోమశిల ప్రాజెక్ట్ మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. కాగా బట్టేపాడులో ఏటికాలువకు సంబంధించిన సాగునీటి సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. నాయకుల మధ్య సమన్వయం లోపించడంతో పాటు సాంకేతిక కారణాలతో ఎన్నికను వాయిదా వేశారు. చెర్లోయడవల్లి, వాశిలి, బండారుపల్లి, మురగళ్ల, రామస్వామిపల్లి, మహిమలూరు పెద్ద చెరువు, మరో చెరువు, గండ్లవేడు చెరువు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలోని 20 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికలు ఏకపక్షంగా సాగాయి. అభ్యర్థులను తప్పుడు కేసులు, బెదిరింపులతో ఇబ్బందులు పెడుతుండడంతో ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో అన్ని చోట్ల ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది.

సంగం: మండలంలోని ఆరు సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. 44 టీసీలకు గానూ 43 టీసీలు ఏకగ్రీవం కాగా ఒక టీసీకి ఎన్నికలు నిర్వహించారు. పడమటిపాళెం, సంగం పంపింగ్ స్కీం, చెన్నవరప్పాడు, జంగాలదొరువు, మర్రిపాడు, అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘాల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

మర్రిపాడు: మండలంలోని 16 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 13 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. చిన్నమాచనూరు, నాగినేనిగుంట, పెగళ్లపాడుకు సంబంధించి అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగలేదు. చిన్నమాచనూరులో ఐదు టీసీలకు నామినేషన్ వేసిన వారు అనర్హతకు గురయ్యారు. పెగళ్లపాడులో ఐదు టీసీలకు సభ్యులను ఎన్నుకోగా, ఒక టీసీకి ఎన్నిక జరగలేదు. అలాగే నాగినేనిగుంటలో ఒక టీసీకి ఎన్నిక జరగలేదు. దీంతో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరగలేదు.

అనుమసముద్రంపేట: మండలంలోని 14 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికలను బహిష్కరించడంతో జనసేన, టీడీపీ నేతలు పోటీ పడ్డారు. పెద్దబ్బీపురంలో జనసేనకు మద్దతు రైతుల ఓట్లను చివరి నిమిషంలో తహసీల్దారు సంతకం లేదంటూ తొలగించారు. దీంతో జనసేన పార్టీ నాయకులు ఎన్నికల కేంద్రం వద్ద బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. జమ్మవరంలో టీడీపీలో రెండు వర్గాలు ఉండగా, ఒక వర్గానికి చెందిన రైతుల ఓట్లను తొలగించడంతో వారు రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. దీంతో అక్కడ సైతం కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రైతులను శాంతింపజేశారు. కాగా 14 సాగునీటి సంఘాల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇరిగేషన్ ఏఈ నిరంజన్ తెలిపారు.

కలిగిరి: మండలంలో 18 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కలిగిరి పెద్దచెరువు, పెద్దఅన్నలూరు చెరువు, కొత్త చెరువు, ఎంవీరాజుపాళెం, నరసారెడ్డిపాళెం, వీర్నకొల్లు, గుడ్లదొన, వీరారెడ్డిపాళెం, కుడుములదిన్నెపాడు, కావలిముస్తాపురం, వెలగపాడు, పరికోట, క్రాకుటూరు, జిర్రావారిపాళెం, తూర్పుదూబగుంట, తెల్లపాడు, చిన్నఅన్నలూరు చెరువు, పెద్దకొండూరు చెరువుల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.

వరికుంటపాడు: మండలంలో 11 చెరువులు, గండిపాళెం జలాశయం పరిధిలోని 9 డిస్ట్రిబ్యూటరీలు, నక్కలగండి రిజర్వాయర్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నోడల్ అధికారి కే అంకులయ్య తెలిపారు.

చేజర్ల: మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. టీఎస్‌పల్లి, ఏటూరు, పాతపాడు, పాడేరు, నాగులవెలటూరు, చేజర్ల, మాముడూరు చెరువులతో పాటు గంగిరెడ్డి కాలువ, జీఎంఎస్ చానల్, పెరుమాళ్లపాడు రివర్ చానల్, సోమశిల దక్షిణ ఉపకాలువలకు సంబంధించి యదనపర్తి ట్యాంక్ నుంచి 23ఎల్ వరకు చేజర్ల, 3 ఎల్ నుంచి నాగులవెలటూరు, గొల్లపల్లి 24 ఎల్ సాగునీటి సంఘాల కమిటీలు ఏకగ్రీవమయ్యాయి.

సీతారామపురం: మండలంలోని ఆరు ఇరిగేషన్ చెరువులకు సంబంధించి నిర్వహించిన సాగునీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చిన్నాగంపల్లి, పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి, బసినేనిపల్లి, సీతారామపురంలోని స్వామిచెరువు, ఊరచెరువుల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు.